సాక్షి ప్రకాశం

శనివారం । 29 । ఏప్రిల్ । 2023



జల్సాల కోసం దొంగతనాలు

తాళ్లూరులో గత నెలలో జరిగిన దొంగతనం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఎస్పీ మలికాగర్గ్ వివరాలు వెల్లడించారు.

- IIలో..



చోరీ ముఠా అరెస్టు

సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు చోరీలకు పాల్పడుతున్న ముఠాను టంగుటూరు పోలీసులు అరెస్టు చేశారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం 39 /26

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం.

న్యూస్‌రీల్

సత్తాచాటిన నంద్యాల జిల్లా ఎడ్లు



బండను లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో ఉపదేశరామస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర స్థాయిలో ఆరుపండ్ల సైజ్ ఎడ్ల విభాగంలో బండ పందెం నిర్వహించారు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఎడ్లు 3495 అడుగులతో మొదటి, నంద్యాల జిల్లా నంద్యాల క్రాంతినగర్, గిద్దలూరు బురుజుపల్లెకు చెందిన ఎం భావనరెడ్డి, ఎదురు శ్రీనివాసరెడ్డి ఎడ్లు 3006 అడుగులతో ద్వితీయ, బేస్తవారిపేట మండలం వంగపాడుకు చెందిన కైపా వెంకట రమణారెడ్డి ఎడ్లు 2944 అడుగులతో తృతీయ, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం నాగయిపల్లెకు చెందిన తవ్వా చంద్రవిజయ్‌కుమార్‌రెడ్డి ఎడ్లు 2876 అడుగులతో నాల్గొవ, కంభం మండలం యర్రబాలెంకు చెందిన వెంకటగిరి హేమలతా నాయుడు ఎడ్లు 2700 అడుగులతో ఐదో స్థానం నిలిచాయి. విజేతలకు కొండావారి కుటుంబ సభ్యులు బహుమతులు అందజేశారు.

మే 26న దివ్యాంగులకు ఉచిత పరికరాలు పంపిణీ

మార్కాపురం టౌన్: ఏప్రిల్ 5న జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు అవసరమైన ఉచిత పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మే 26న పరికరాలను అందించనున్నట్లు వైఎస్‌ఆర్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల రెడ్డి శుక్రవారం తెలిపారు. వర్చొ ఫౌండేషన్, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్, వైఎస్‌ఆర్ దివ్యాంగుల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బధిరులకు, శారీరక దివ్యాంగులకు వాకర్లు, చంక కర్రలు, హ్యాండ్ స్టిక్, కంటి చూపు లోపం ఉన్నవారికి బ్లైండ్ స్టిక్స్ అవసరమైన వారు మే 26న హాజరు కావాలన్నారు. వచ్చేటప్పుడు, ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, 2 ఫొటోలు, ఫోన్ నంబర్ తెచ్చుకోవాలని తెలిపారు. వివరాలకు 7382912753 నంబరుకు సంప్రదించాలని కోరారు.

వేసవి సెలవులు వచ్చాయంటే చిన్నారులకు పండుగేం .. పుస్తకాలతో కుస్తీపట్టిన వారికి ఒక్కసారిగా సంతోషం అనే రెక్కలు వచ్చి విహరించనున్నారు. పరీక్షలన్నీ ముగిసిపోయాయ్..స్కూళ్లకు సెలవులు వచ్చేశాయ్.. ఆటపాటలతో గడిపేద్దామా అని ఎదురు చూస్తున్న విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు క్రీడా ప్రాధికార సంస్థ ముందుకొచ్చింది. నెల రోజుల పాటు 23 రకాల ఆటలపై శిక్షణ ఇచ్చేందుకు షెడ్యూల్ ప్రకటించింది. ఇంకెందుకాలస్యం..మైదానాలకు పోదాం..ఎంజాయ్ చేద్దాం..పదండి..



మైదానాలకు పోదాం.. ఎంజాయ్ చేద్దాం..

ఆటలు నేర్చుకుందాం..రా..

- మే 1 నుంచి 31వ తేదీ వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు
- జిల్లా వ్యాప్తంగా 50 ప్రాంతాల్లో 23 క్రీడల్లో శిక్షణ
- రోజూ నాలుగు గంటల శిక్షణ
- రాష్ట్ర ప్రాధికార సంస్థ నుంచి రానున్న క్రీడా సామగ్రి

ఒంగోలు:

ఆటలకు సమయం ఆసన్నమైంది. కరోనా కారణంగా వేసవి శిక్షణ శిబిరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకూడదంటూ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా వెంట వెంటనే విద్యాసంస్థలు నడపాల్సి వచ్చింది. దీంతో వేసవి శిక్షణ శిబిరాలకు ఇబ్బందిగా మారింది. అయితే ప్రస్తుతం పాఠశాల స్థాయిలో ఏప్రిల్ నాటికి, జూనియర్ కాలేజీ స్థాయి మార్చి నాటికి ముగుస్తుండడంతో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు క్రీడా ప్రాధికార సంస్థ ముందుకొచ్చింది. క్రీడల పట్ల ఆసక్తి, నైపుణ్యాలు పెంచడం, ప్రతిభను వెలికితీయడం, శారీరక, మానసికోల్లాసం కల్పించడం వేసవి శిబిరాల ప్రధాన లక్ష్యం. సమ్మర్ క్యాంప్‌ల్లో పాల్గొనడం ద్వారా కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం కలుగుతుంది. ఆటల్లో మరింత నైపుణ్యం సాధిస్తారు. క్రీడలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

గ్యాడ్జెట్స్‌కు బ్రేక్..

ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ పట్టుకోని పిల్లలు లేరు. కొంచెం ఖాళీ సమయం దొరికినా ఫోన్తోనే గడిపేస్తున్నారు. ఉదయం నిద్రలేచింది మొదలు స్కూల్ కు వెళ్లే వరకు ఫోన్ తోనే గడిపేస్తున్నారు. తిరిగి స్కూల్ నుంచి ఇంటికి రాగానే స్మార్ట్ ఫోన్ తోనే ఆటలాడుతున్నారు. శారీరక వ్యాయామానికి పూర్తిగా దూరమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేసవి సెలవుల్లో చిన్నారులు క్రీడలపై ఆసక్తి పెంచేలా శిక్షణ ఇప్పిస్తే మానసికోల్లాసంతోపాటు శారీరక దృఢత్వం పెరుగుతుంది.

50 ప్రాంతాలు...23 రకాల ఆటలు:

జిల్లాలోని 38 మండలాల్లో 50 ప్రాంతాల్లో 23 రకాల ఆటలకు శిక్షణ ఇస్తారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారు. ఈ మేరకు సంబంధిత ప్రాంతాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు, పలు క్రీడాసంఘాల ప్రతినిధులు ఆసక్తిగా ముందుకొచ్చారు. అయితే 28 ప్రాంతాల్లోని పీఈటీలు మే 1 నుంచి 5వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్‌కు క్రీడాకారులను తీసుకెళ్తున్నందున మిగిలిన 22 చోట్ల ఒకటో తేదీ ప్రారంభిస్తారు. మిగిలిన ప్రాంతాల్లో 5వ తేదీలోగా ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నారు. శిక్షణకు అవసరమైన పరికరాలను తెప్పించేందుకు క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే కోచ్‌లను సిద్ధం చేశారు. శిబిరాల వద్ద మౌలిక వసతులు ఉండేలా చూస్తున్నారు.

ఏ గేము ఎక్కడ

బాక్సింగ్: ఒంగోలు మినీ స్టేడియం, మార్కాపురం జెడ్పీహెచ్‌ఎస్
ఖోఖో: కనిగిరి, కనిగిరి మండలం పాతపాడు, పెద్దారవీడు, రుద్రవరం, ఈదర జెడ్పీహెచ్‌ఎస్
వెయిట్‌లిఫ్టింగ్: ఒంగోలు భారత జాతీయ వ్యాయామ కళాశాల, కె.బిట్రగుంట కేజీబీవీ
హాకీ: చీమకుర్తి, మైనంపాడు, కనిగిరి జెడ్పీహెచ్‌ఎస్
ఆర్చరీ: ఒంగోలు మినీ స్టేడియం, వై.పాలెం జెడ్పీహెచ్‌ఎస్
బ్యాడ్మింటన్: ఒంగోలు మినీ స్టేడియం
రైఫిల్ షూటింగ్: ఒంగోలు మినీ స్టేడియం
ఫుట్‌బాల్: ఒంగోలు మినీ స్టేడియం, మార్కాపురం జెడ్పీహెచ్‌ఎస్, ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్స్
కరాటే: ఒంగోలు మినీ స్టేడియం, గిద్దలూరు, కొత్తపట్నం జెడ్పీహెచ్‌ఎస్
హ్యాండ్‌బాల్: సంతనూతలపాడు, సింగరాయకొండ, కనిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌తోపాటు ఒంగోలు మినీ స్టేడియం
చదరంగం: ఒంగోలు మినీ స్టేడియం
అథ్లెటిక్స్: ఒంగోలు మినీ స్టేడియం, వై.పాలెం జెడ్పీహెచ్‌ఎస్
స్కేటింగ్: ఒంగోలు మినీ స్టేడియం
స్విమ్మింగ్: ఒంగోలు రాంనగర్ 12వ లైను
టెన్నిస్: గిద్దలూరు కృషి వికాస కేంద్రం
టెన్నికాయిట్: ఒంగోలు మినీ స్టేడియం, టంగుటూరు జెడ్పీహెచ్‌ఎస్
జూడో: ఒంగోలు సూర్య విద్యానికేతన్, టంగుటూరు జెడ్పీహెచ్‌ఎస్
ఫెన్సింగ్: ఒంగోలు మినీ స్టేడియం
వాలీబాల్: కొత్తపట్నం, మార్కాపురం, త్రోవగుంట, అల్లూరు, ఒంగోలు మినీ స్టేడియం
రగ్బీ: రాయవరం జెడ్పీహెచ్‌ఎస్
కబడ్డీ: ఒంగోలు మినీ స్టేడియం, కనిగిరి, మార్కాపురం, త్రోవగుంట జెడ్పీహెచ్‌ఎస్
ఉషు: ఒంగోలు మంగమూరు రోడ్డు, ఒంగోలు గద్దలగుంట
రెజ్లింగ్: ఒంగోలు మినీ స్టేడియం

క్రీడా మెటీరియల్, ప్రశంస పత్రాలు పంపిణీ



మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి ఇప్పటికే ఆదేశాలు అందాయి. అందులో భాగంగా 50 ప్రాంతాల్లో 23 క్రీడల్లో శిక్షణకు ఏర్పాట్లు సిద్ధం చేశాం. క్రీడల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ కూడా రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి తెప్పించే పనిలో ఉన్నాం. రాగానే శిక్షకులకు వాటిని అందిస్తాం. శిక్షణ ముగిసిన అనంతరం శిక్షణార్థులకు ప్రశంసపత్రాలు పంపిణీ చేస్తాం.

– జిల్లా చీఫ్ కోచ్ జి.రాజరాజేశ్వరి

సీఎం సహాయనిధి చెక్కు మంత్రి పంపిణీ



రఘునాథరెడ్డికి చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా సీఎం సహాయనిధి చెక్‌ను మండలంలో దేవరాజుగట్టు గ్రామం వైఎస్సార్ సీపీ నాయకుడు నందిరెడ్డి రఘునాథరెడ్డికి శుక్రవారం అందజేశారు. ఆయన భార్య ధనలక్ష్మి వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో మంత్రి చొరవ తీసుకొని సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయించారని, మంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటానని రఘునాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, నాయకులు అల్లు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- కలెక్టర్లతో సీఎం వైఎస్ జగన్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, జేసీ కె.శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లకు స్పష్టం చేశారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు. వీడియో సమావేశంలో జగనన్నకు చెబుదాం, గృహ నిర్మాణాలు, జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష, నాడు-నేడు తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. దీనిలో హౌసింగ్ పీడీ పేరయ్య, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఈఓ రమేష్, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, డీపీవో నారాయణరెడ్డి, ఎస్ఈ మర్దన్‌అలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఒంగోలు: ఒంగోలు నుంచి అరుణాచలంకు నేరుగా బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం బి.సుధాకర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలోని ఛాంబర్‌లో శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సూపర్‌లగ్జరీ బస్సులో టిక్కెట్ ధర రూ.2 వేలుగా నిర్ణయించారు. ఈ బస్సులు మే 4వ తేదీ, జూన్ 3వ తేదీ, జూలై 2, జూలై 31, అక్టోబరు 28, నవంబరు 26, డిసెంబర్ 26 తేదీల్లో బస్సులు ఒంగోలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 6గంటలకు బస్సు ఒంగోలు నుంచి బయల్దేరుతుందని, గిరి ప్రదక్షిణ అనంతరం మరుసటిరోజు ఉదయం 6 గంటలకు అరుణాచలం నుంచి బస్సు బయల్దేరుతుందని తెలిపారు. కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

నాలుగు టికెట్ల కంటే ఎక్కువ ఉంటే నేరుగా తమ సిబ్బందే వచ్చి టిక్కెట్లు బుక్ చేసుకుంటారని, 50 మంది భక్తులు ఉంటే ఎక్స్‌ప్రెస్ సర్వీస్, 40 మంది ఉంటే సూపర్ లగ్జరీ బస్సు అద్దెకు ఇస్తామన్నారు. టికెట్ల కోసం ఆర్టీసీ వెబ్‌సైట్ లేదా ఒంగోలు రిజర్వేషన్ కౌంటర్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 995225704, 08592 220733 నంబర్లను సంప్రదించాలని కోరారు. జిల్లాలో గిద్దలూరు, మార్కాపురం, పొదిలి, కనిగిరి డిపోల నుంచి కూడా బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

జల్సాల కోసం దొంగతనాలు

- తాళ్లూరు చోరీ కేసులో ఐదుగురు దొంగల అరెస్టు
- రూ.43.50 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- కారులో తిరుగుతూ దర్జాగా చోరీలు
- చోరీ వివరాలను వెల్లడించిన ఎస్పీ మలికాగర్గ్



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ మలికా గర్గ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: తాళ్లూరులో గత నెలలో జరిగిన దొంగతనం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.43.50 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మలికాగర్గ్ పూర్తి వివరాలను వెల్లడించారు. తాళ్లూరుకు చెందిన చందోలు శ్రీనివాసరావు గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత నెల మార్చి 7వ తేదీన కుటుంబసభ్యులతో కలిసి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లకు వెళ్లారు. రాత్రి 3.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి తలుపులు తీయడానికి ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. దీంతో సమీపంలోని వ్యక్తుల సహకారంతో ఇంటి తలుపులు తెరిచి చూడగా లోపల వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. కప్‌బోర్డుతో పాటుగా బీరువా తెరచి ఉంది. అందులోని బంగారు ఆభరణాలు, సొమ్ము కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ మలికా గర్గ్ అడిషనల్ ఎస్పీ (క్రైమ్) శ్రీధర్‌రావు, దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అన్ని కోణాల్లో విచారణ చేసిన ప్రత్యేక బృందం తాళ్లూరు మండలంలోని శివరాంపురం గ్రామ శివార్లలో ఎన్ఎస్పీ కాలువ వద్ద సంచరిస్తున్న నిందితులను పక్కా సమాచారంతో శుక్రవారం పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.40 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, కారును స్వాధీనం చేసుకున్నారు.

నిందితులంతా బంధువులే..

ఈ కేసులో అరెస్టు అయిన నిందితులంతా బంధువులే కావడం విశేషం. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వనపర్తి రాజు ప్రస్తుతం అద్దంకి మండలంలోని ధేనువకొండలో నివశిస్తున్నాడు. వివిధ జిల్లాల్లో ఇతనిపై 17 కేసులు నమోదై ఉన్నాయి. చెడు వ్యసనాలకు అలవాటు పడిన రాజు రాత్రి పూట దొంగతనాలు చేస్తూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తుంటాడు. వివాహం జరిగిన తరువాత చిన్నచిన్న కూలీ పనులు చేసుకుంటున్న అతడు కరోనా సమయంలో చేతిలో డబ్బులు లేకపోవడంతో పొన్నలూరు మండలం తేటిపేటకు చెందిన చలంచర్ల మల్లికార్జున, అతడి తండ్రి ఆంజనేయులు, తమ్ముడు చెంచయ్య, రాజు బావమర్ది కొమరగిరి పేరయ్యలతో కలిసి దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని దొంగతనాలు చేస్తున్నాడు. చోరీ సొమ్ముతో దర్జాగా కారులో తిరుగుతూ జల్సాలు చేసేవాడు. ఈ క్రమంలో తాళ్లూరులో చోరీ చేసి చివరికి పోలీసులకు చిక్కారు.

పోలీసులకు ఎస్పీ అభినందనలు..

చోరీ కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన దర్శి డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, దర్శి సీఐ జె.రామకోటయ్య, తాళ్లూరు, ముండ్లమూరు ఎస్సైలు బి.ప్రేమ్ కుమార్, ఎల్.సంపత్ కుమార్, ఏఎస్సై జి.మోహన్‌రావు, కానిస్టేబుళ్లు విజయ్, శేష గిరి, రాములు, బ్రహ్మనాయుడు, హోం గార్డు వెంకటరెడ్డిలను ఎస్పీ మలికా గర్గ్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

నుల్కు కో ఆప్టెడ్ మెంబర్‌గా ఇందిరా ప్రియదర్శిని

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



బి.ఇందిరా ప్రియదర్శిని

ఒంగోలు సబర్బన్: నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ మిషన్(నుల్కు)గవర్నింగ్ కౌన్సిల్ అండ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా బి.ఇందిరా ప్రియదర్శినిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జంజం శ్యామలారావు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా జీఓ ఆర్టీ నంబర్–273ను విడుదల చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డవలెప్‌మెంట్–మెప్మాలో భాగంగా బి.ఇందిరా ప్రియదర్శిని ఈ కమిటీలో సేవలు అందిస్తారు. మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ మిషన్ గవర్నింగ్ కౌన్సిల్ అండ్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో సేవలు అందిస్తారు. మెప్మాకు చెందిన రాష్ట్ర మిషన్ డైరెక్టర్ పంపిన నివేదిక ప్రకారం బి.ఇందిరా ప్రియదర్శినికి ఈ పదవిని ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తనకు ఈ పదవి ఇచ్చినందుకు శక్తి వంచన లేకుండా చేస్తానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేకంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి



మృతిచెందిన గురవయ్య



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మార్కాపురం: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో వాటర్ ట్యాంక్ ఎదురుగా ఉన్న వీధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన గురవయ్య (29) కరెంటు పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం వాటర్ ట్యాంక్ ఎదురుగా ఉన్న ఒక ఇంట్లో కరెంటు పని నిమిత్తం గోడకు గాడి కొడుతుండగా మిషన్ పాడై పోవడంతో రిపేర్ చేస్తూ ఉండగా వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే గుర్తించి జిల్లా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య పుష్పలత, పదేళ్ల కుమారుడు మహేష్, 10 నెలల కుమారుడు మహేంద్ర ఉన్నారు.

నేడు పదోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల నుంచి స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతి పొందేందుకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగిన ఉపాధ్యాయులు, సీనియార్టీ జాబితాలో నమోదైన వారికి శనివారం పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుగుతుందని, సంబంధిత ఉపాధ్యాయులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- ఎస్పీ మలికా గర్గ్



సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సంక్షేమ దివస్‌ను నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, హోంగార్డులు ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సస్పెండ్ నుంచి రిలీవ్ వరకు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. సిబ్బంది నుంచి వినతులను స్వీకరించిన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తగిన పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీసు గ్రీవెన్స్‌ను పోలీసు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ఓ.దుర్గాప్రసాద్, ఎస్సై సుదర్శన్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల చోరీ ముఠా అరెస్టు

- ఇద్దరు నిందితులను అదుపులోనికి తీసుకున్న పోలీసులు
- వారి వద్ద నుంచి 3 ల్యాప్‌టాప్‌లు, 42 సెల్‌ఫోన్లు స్వాధీనం
- రికవరీ సొత్తు విలువ రూ.5.50 లక్షలు
- వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ నాగరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు, సీఐ, ఎస్సైలు

టంగుటూరు: సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3 ల్యాప్‌టాప్‌లు, 42 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగరాజు వివరాలు వెల్లడించారు. ఈ నెల 26న టంగుటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి టిఫిన్ చేస్తూ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ బ్యాగ్‌లు కుర్చీలో ఉంచి టిఫిన్ చేసిన తర్వాత చేతులు శుభ్రపరుచుకునేందుకు వెళ్లగా చోరీకి గురయ్యాయి. దీంతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు ల్యాప్‌టాప్ అమ్మటానికి సెల్‌ఫోన్ దుకాణానికి రాగా..యజమానికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా, సిబ్బంది వారిని అదుపులోనికి తీసుకొని విచారించారు. విచారణలో తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా, గుడిమాతం మండలం సంకరాపురం గ్రామానికి చెందిన అన్నమలై రంగనాధన్, మణియప్పన్ రంగనాథన్‌లు దొంగతనాలు చేస్తున్నట్లు గుర్తించారు. వీరు పది రోజులుగా టంగుటూరులో ఒక రూం అద్దెకు తీసుకొని చెవిటి, మూగ అనే సర్టిఫికెట్లు పెట్టుకొని రైళ్లు, బస్సులు, విద్యార్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్నట్లు నటించి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్నారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసి వారి రూంలో ఉన్న 3 ల్యాప్‌టాప్‌లు, 42 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరగా చాకచక్యంగా ఛేదించిన సీఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్సై ఖాదర్‌బాషా, సిబ్బందిని డీఎస్పీ నాగరాజు అభినందించారు.

నేడు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

ఒంగోలు: ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష శనివారం జరగనుంది. మొత్తం 3051 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరికి ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలతో పాటు ఇన్విజిలేటర్ల నియామకం, పరీక్షా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాలపై ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ టి.జయశ్రీ పర్యవేక్షించారు. ఒంగోలులో బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాల, పీవీఆర్ బాలుర, పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలు, చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కందుకూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, వలేటివారిపాలెం జెడ్పీ ఉన్నతపాఠశాల, అద్దంకిలోని ప్రభుత్వ బాలుర , ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలు, మార్టూరులో జెడ్పీ ఉన్నత పాఠశాల, పర్చూరు వైఆర్ ఉన్నతపాఠశాల, చీరాల ఎన్ఆర్అండ్‌పీఎం ఉన్నత పాఠశాలల్లో శనివారం పరీక్షలు నిర్వహిస్తారు.

మర్రిపూడి చెరువుకు రూ. 28.50 కోట్లు మంజూరు



పైపులైన్ నిర్మాణానికి అనుమతులు మంజూరు పత్రం

మర్రిపూడి: పొదిలి చిన చెరువు నుంచి మండలంలోని గుండ్లసముద్రం మీదుగా మర్రిపూడి చెరువుకు తాగు, సాగునీరు అందించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పొదిలి నుంచి 6 వేల మీటర్ల దూరం ఉన్న మర్రిపూడి చెరువుకు అండర్ గ్రౌండ్ పైపులైన్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.28.5 కోట్లు మంజూరు చేస్తూ అనుమతులు మంజూరయ్యాయి. పొదిలి చిన చెరువు నుంచి మర్రిపూడి మండలంలోని గుండ్ల సముద్రం, మర్రిపూడి ఇరిగేషన్ చెరువులకు తాగు, సాగునీరు అందించి మండల ప్రజల ఇక్కట్లు తీర్చాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఈ నెల 12న మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. డబ్ల్యూఆర్‌డీ మైనర్ ఇరిగేషన్ ద్వారా ఈ చెరువులకు నీరు అందించడం వల్ల మండలంలోని 35 వేల మంది ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీరనున్నాయి. దీంతో పాటు మండలంలోని వల్లాయపాలెం , దుగ్గిరెడ్డిపాలెం, కెల్లంపల్లి, పన్నూరు, చిమట తదితర గ్రామాల దాహార్తి తీరడమేకాక, భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి బోర్లల్లో నీరు సంవృద్ధిగా ఉంటుంది. ఎన్నో ఏళ్ల తీరని సమస్య సాకారం చేసి, మండలంలోని చెరువులకు తాగు, సాగునీరు అందేందుకు కృషి చేసిన ఎంపీపీ వాకా వెంకటరెడ్డిని మండల ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

పొదిలిలో సినీ నటుడు ఆలీ



పొదిలి: ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, సినీ నటుడు ఆలీ శుక్రవారం పొదిలికి వచ్చారు. ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న అభిమానులు కొందరు ఆలీతో సెల్ఫీలు దిగేందుకు, షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు గుమిగూడారు. తన భూములకు సంబంధించి లావాదేవీల నిమిత్తం కార్యాలయానికి వచ్చినట్లు సమాచారం.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

- తన జల్సాలను ప్రశ్నిస్తున్నాడని భర్తను హత్య చేసిన జమలమ్మ
- ఎన్టీఆర్ జిల్లాలో ఘటన

విజయవాడ స్పోర్ట్స్ : తన జల్సాలకు అడ్డుపడుతున్న భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మీ శుక్రవారం తీర్పు చెప్పారు. 2016 నవంబర్ 23న కొత్తపేట (టూ టౌన్) పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటన అప్పట్లో నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన జమలమ్మకు జి.కొండూరు మండలం వెంకటాపురానికి చెందిన ఏడుకొండలు(32)కు 16 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లకు జమలమ్మ చెడు వ్యసనాలకు బానిసైంది. వీటిపై ప్రశ్నిస్తున్న భర్త ఏడుకొండలును అడ్డు తొలగించుకోవాలనే నిర్ణయాన్ని తన చెల్లెలు లక్ష్మికి వివరించింది. అదే గ్రామంలో హత్య చేస్తే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో కాపురాన్ని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి.నైనవరం గ్రామానికి మార్చింది. అంబాపురంలో కొత్త ఇంట్లోకి ప్రవేశించిన రోజునే చెల్లెలు లక్ష్మి, న్యూఆర్ఆర్ పేటకు చెందిన ఒడియార్ గణేష్, జక్కంపూడికి చెందిన బాలసాని తిరుపతి సాయంతో జమలమ్మ తన భర్త ఏడుకొండలు మెడకు తాడు చుట్టి చంపేసిందని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. మూడు రోజుల తర్వాత ఆ గది నుంచి వస్తున్న దుర్వాసను పసిగట్టిన ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జమలమ్మకు కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. మిగిలిన నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా విడుదలయ్యారు.

చైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన వాణి

పెనమలూరు : శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన జగన్నాథం వాణి(17) కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతోంది. గత రెండు రోజుల కిందట ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయింది. కాగా గురువారం వాణి సోదరుడు రాము కాలేజీ హాస్టల్‌కు వచ్చి వాణితో మాట్లాడి వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం కాలేజీ హాస్టల్‌లో స్టడీ అవర్‌కు రావాల్సిన వాణి రాలేదు. దీంతో ఆమె కోసం రూమ్‌కు వెళ్లి మిత్రులు చూడగా ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతి చెంది ఉంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమంలో పాల్గొనం

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి: రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమాల్లో పాల్గొనబోమని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంపై పోరాటం చేసే విధంగా కొన్ని శక్తులు సచివాలయ ఉద్యోగులను రెచ్చ గొడుతున్నాయని తెలిపింది. సచివాలయ ఉద్యోగులు వారి మాటలకు ప్రభావితం కావొద్దని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా, ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, ఉపాధ్యక్షులు సిరిపురం హరి, కె.రామకృష్ణా రెడ్డి, జి.హరీంద్ర, కె.కిరణ్, బి.పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికి కొందరు కుట్ర చేస్తున్నారని, ఇలా కుట్ర పన్నిన వారెవ్వరూ తమకు ఉద్యోగాలివ్వలేదని చెప్పారు. తమను ఉద్యోగులుగా గుర్తించని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్న సచివాలయ ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయడానికి చేస్తున్న కుట్రను ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్ష , కార్యదర్శులుగా కె.వైధురిదేవి, ఎ.సుస్మిత


ఎన్నికైన సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షురాలిగా కె.వైధురి దేవి, ఉపాధ్యక్షురాలిగా ఎం.లక్ష్మణ కుమారి, కార్యదర్శిగా ఎ.సుస్మిత, అదనపు కార్యదర్శి(జనరల్)గా ఎం.రాజేశ్వరి, అదనపు కార్యదర్శి (కల్చరల్)గా ఎస్.నాగ లలితాదేవి, సంయుక్త కార్యదర్శిగా కె.సునీత, కోశాధికారిగా టి.శారద ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.విజయలక్ష్మి, డి.సాహిత్య వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల వివరాలను ఎన్నికల అధికారి ఎస్.శాంతి కుమారి శుక్రవారం ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన ఉద్యోగుల హక్కుల రక్షణకు చర్యలు

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

సాక్షి, అమరావతి: గిరిజన ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు చెప్పారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఎస్టీ ఉద్యోగుల సర్వీసు సమస్యలపై గురు, శుక్రవారాల్లో విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ విచారణ నిర్వహించింది. ఈ విచారణకు అధ్యక్షత వహించిన రవిబాబు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యలపై ఏడు శాఖలకు చెందిన అధికారులను పిలిచి విచారించినట్లు తెలిపారు. గిరిజన ఉద్యోగులకు న్యాయం జరిగే విధంగా సూచనలు చేసినట్లు చెప్పారు. గిరిజన ప్రజల నివాస, వ్యవసాయ భూముల సమస్యలపై కూడా విచారణ చేసి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలో గిరిజన ప్రజలు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ కార్యదర్శి డాక్టర్ గంగాధర్, డిప్యూటీ డైరెక్టర్ పొట్లూరి పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల విలువ పెంపుతో గిరి రైతు మనుగడ

- అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగన్నాథరావు
- కనుల పండువగా విత్తనాల పండగ

దుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలో పంటల ఉత్పత్తుల విలువ హెచ్చింపుతోనే గిరిజన రైతులకు మనుగడ ఉంటుందని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జగన్నాథరావు అన్నారు. దుంబ్రిగుడ మండలం కిల్లోగుడ గ్రామంలో సంజీవని సంస్థ, థింసా గిరిజన ఉత్పత్తిదారుల సంఘం సంయుక్తంగా శుక్రవారం జీవ వైవిధ్య జాతరలో భాగంగా విత్తనాల పండగను ఘనంగా నిర్వహించింది. గిరిజన రైతుల సంప్రదాయ విత్తనాలతో పాటు ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు సంస్థల ప్రతినిధులు దేశీయ విత్తనాల స్టాళ్లను ప్రదర్శించారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పాత విత్తనాల ద్వారా గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న అన్ని పంటల్లోనూ పోషక విలువలు అధికంగా ఉన్నాయన్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సురేష్‌కుమార్, రైతు సాధికారత సంస్థ రీజినల్ టెక్నికల్ అధికారి ఎం.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగులోనూ రైల్వే టికెట్ బుకింగ్

- ఫోన్‌లో యూటీఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం
- అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్‌లో సరికొత్త సేవలు
- ఆన్‌లైన్, యాప్‌ల్లో జనరల్ టికెట్ల బుకింగ్ ఇక సులువు
- రైల్వేస్టేషన్లలో క్యూలైన్ల బాధలకు చెక్


క్యూలైన్‌లో రైల్వే టికెట్ కోసం నిలబడి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: జనరల్ టికెట్ కోసం ఆదరాబాదరాగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. చాంతాడంత పొడవు ఉండే క్యూలైన్లలో నిలబడి.. ఈలోపు తాము ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుందేమోనని ఆదుర్దా పడేవారే ఎక్కువ. ఇలా ఇబ్బందులు పడే ప్రయాణికుల కోసం రైల్వే శాఖ నాలుగేళ్ల క్రితం అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్)ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. యూటీఎస్ విధానంలో యాప్, వెబ్‌సైట్ ద్వారా రైలు టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇంగ్లిష్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దీన్ని ప్రాంతీయ భాషలకు కూడా రైల్వే శాఖ విస్తరించింది. దీంతో తెలుగు సహా వివిధ ప్రాంతీయ భాషల్లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సాధారణ (జనరల్) రైలు టికెట్లను దిగువ శ్రేణి ప్రయాణికులు ఎక్కువగా తీసుకుంటారని.. వీరి కోసం ప్రాంతీయ భాషల్లో యాప్‌ని తీసుకొస్తే వినియోగం మరింత పెరుగుతుందనే ఉద్దేశంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

ఎలాంటి శ్రమ లేకుండా యాప్ నుంచే..

యూటీఎస్ యాప్ ద్వారా ఎలాంటి శ్రమ లేకుండా మొబైల్ ఫోన్ నుంచే జనరల్ టికెట్ పొందొచ్చు. అయితే టికెట్ బుక్ చేసుకోవడానికి ఇంగ్లిష్ మాత్రమే అందుబాటులో ఉండటంతో గ్రామీణులు, పెద్దగా చదువుకోనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సులభంగా యాప్ వినియోగించేలా ప్రాంతీయ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం, మరాఠీ, ఒడియా, తమిళ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా జనరల్ టికెట్‌తో పాటు ప్లాట్‌ఫామ్ టికెట్ కూడా కొనుగోలు చేయొచ్చు. అలాగే సీజన్ టికెట్ బుకింగ్, రెన్యువల్ సైతం చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్‌లో ప్రాంతీయ భాషల అప్‌డేట్ వెర్షన్‌ను ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. హార్డ్ కాపీ, పేపర్‌లెస్ టికెట్.. రెండు ఆప్షన్లు ఉన్నాయి.

యూటీఎస్ యాప్

ఎన్ని భాషల్లో: తెలుగు, ఇంగ్లిష్, కన్నడం, మలయాళం, హిందీ, తమిళం, ఒడియా, మరాఠీ
దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న రైల్వేస్టేషన్లు: 9,120
డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 10 మిలియన్లకు పైగా
యాప్ ద్వారా రోజుకు బుక్ అవుతున్న టికెట్లు: 2.34 లక్షలు
రోజూ వినియోగిస్తున్న ప్రయాణికులు: 14.21 లక్షల మంది

స్టేషన్‌కు 5 కి.మీ. పరిధిలో..



మొబైల్‌లోని జీపీఎస్ ఆధారంగా యూటీఎస్ యాప్ పనిచేస్తోంది. టికెట్ బుక్ చేసుకునే సమయంలో మొబైల్ జీపీఎస్ లొకేషన్ ఆన్‌లో ఉండాలి. రైల్వేస్టేషన్ ఆవరణకు 30 మీటర్ల నుంచి 5 కి.మీ. పరిధిలో ఉన్న ప్రయాణికులు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా యాప్ ద్వారా 3 నెలలు, 6 నెలలు లేదా సంవత్సరానికి సీజన్ టికెట్లను తీసుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్, మెయిల్, ప్యాసింజర్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు యూటీఎస్ టికెట్ బుకింగ్ చెల్లుబాటు అవుతుంది.
– అనూప్‌కుమార్ సత్పతి, డీఆర్ఎం, వాల్తేరు

ఆ సంఘాల ఆందోళనలకు దూరంగా ఉందాం

- గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు
- ఒకే విడతన 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- సచివాలయ ఉద్యోగులకు, ప్రభుత్వం మధ్య సుహృద్భావ వాతావరణం ఉంది
- కొన్ని సంఘాలు స్వార్థం కోసం దానిని చెడగొట్టడానికి చూస్తున్నాయి
- సచివాలయాల ఉద్యోగులందరూ గమనించాలి
- ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనవద్దు

సాక్షి, అమరావతి : స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఆందోళనలకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు దూరంగా ఉండాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ యూనియన్ పిలుపునిచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, ఒకే విడతలో లక్ష మందికి పైగా ఉద్యోగాలిచ్చి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని తెలిపింది. అలాంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని ఉద్యోగ సంఘాలు శనివారం నిర్వహించతలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనవద్దని తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సుహృద్భావ వాతావరణం ఉందని, కొన్ని ఉద్యోగ సంఘాలు స్వార్థ, రాజకీయ అవసరాలకు ఆ వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఉద్యోగులందరూ దీనిని గమనించాలని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ఆర్ కిషోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా 1.34 లక్షల గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగాలను భర్తీ చేసి, ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషన్ డిక్లేర్ చేసి అందరినీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేసిన సీఎం జగన్‌కు సచివాలయాల ఉద్యోగులందరూ ఎప్పటికీ కృతజ్ఞులుగానే ఉంటారని పేర్కొన్నారు. ఉద్యోగులు కోరిన విధంగా 010 పద్దు కింద జీతాలు ఇచ్చారని, డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో నెగిటివ్ మార్కులు తొలగించారని, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, శానిటేషన్ సెక్రటరీలకు వీక్లీ ఆఫ్‌లు ఇచ్చారని తెలిపారు. సచివాలయాల ఉద్యోగులకు అనేక మేళ్లు జరిగాయంటే సీఎం జగన్‌కు మనపై ఉన్న ప్రేమాభిమానాలే కారణమని చెప్పారు.

బదిలీలపై గందరగోళం సృష్టిస్తున్నారు

సచివాలయాల ఉద్యోగులు చాలా మంది వివిధ కారణాలతో బదిలీలు కోరుకుంటున్నారని తెలిసిన వెంటనే సీఎం జగన్ అంగీకారం తెలిపారన్నారు. సచివాలయాల మహిళా ఉద్యోగులు పెళ్లి చేసుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తే.. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు రిక్వెస్టు బదిలీలు కాదని, సాధారణ బదిలీలు జరపాలని వితండ వాదం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్ల సర్వీస్ పూర్తయి బదిలీ కావాలని కోరుకున్నా ట్రాన్స్‌ఫర్ చేయకూడదని, మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారందరినీ బదిలీ చేయాలని వాళ్లు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సచివాలయాల ఉద్యోగులందరినీ బదిలీ చేయమని చెప్పడానికి వీళ్లెవరని నిలదీశారు. బదిలీ వద్దనుకొనే ఉద్యోగిని కూడా బలవంతంగా బదిలీ చేయమనడానికి వీళ్లకేం హక్కుందన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకే సాధారణ బదిలీ చేయడం సంప్రదాయంగా వస్తోందని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు మాత్రం మూడేళ్లకే సాధారణ బదిలీలు చేయమని ఉద్యోగ సంఘం నాయకులు ఎలా అడుగుతారని అన్నారు. గందరగోళం సృష్టించి బదిలీ ప్రక్రియను అడ్డుకోవడానికి కొందరు జేఏసీల పేరుతో ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని తప్పుపట్టారు. దీనిని అందరూ గమనించాలని కోరారు. సచివాలయాల ఉద్యోగులు ఆ ధర్నాలు, నిరసనలు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఏయూలో ఉద్యోగ విప్లవం

- ఒకే వేదికపై 761 మందికి ఆఫర్ లెటర్స్
- తల్లిదండ్రుల సమక్షంలో ఉద్యోగ పత్రాలు


తల్లిదండ్రులకు నమస్కరిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): అమ్మానాన్నల పాదాలకు విద్యార్థులు నమస్కరించారు. తమ అభ్యున్నతికి అహరహం శ్రమించిన తల్లిదండ్రులను విశ్వవిద్యాలయం వేదికగా విద్యార్థులే సత్కరించారు. ఈ అరుదైన సంఘటన గురువారం ఆంధ్రవిశ్వవిద్యాలయం (ఏయూ)లో కనిపించింది. విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైన్స్ కళాశాల అచీవర్స్ డే దీనికి వేదికైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగ విప్లవానికి వేదికగా నిలిచింది. ఏయూలో ఉద్యోగాలు సాధించిన 761 మంది విద్యార్థులకు ఆ వేదికపై నియామక పత్రాలను అందించే కార్యక్రమాన్ని ఏయూ నిర్వహించింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏయూ రాష్ట్రానికి ఆదర్శంగా, విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలుస్తోందని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రత్నాల్లాంటి పిల్లలను పెంచి విశ్వవిద్యాలయానికి పంపిన తల్లిదండ్రులందరినీ సన్మానించడం చూసి గర్విస్తున్నామన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. వర్సిటీలో ప్రతి విద్యార్థి ఉద్యోగ సాధన, ఉపాధి కల్పన చేసే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారని, దీన్ని సాకారం చేసే దిశగా ఏయూ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఇచ్చే నిజమైన సంపద విద్య అని ముఖ్యమంత్రి ఇదే వేదిక నుంచి అన్నారని గుర్తుచేశారు. క్రమశిక్షణతో మీ పిల్లలను పెంచినందుకు మీ అందరికీ వందనం అంటూ తల్లిదండ్రులకు నమస్కరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది 81 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఈ సంవత్సరం దీన్ని అధిగమించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తదితరులు ప్రసంగించారు.

వేదాలు విజ్ఞాన భాండాగారాలు

- రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్
- ఘనంగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం
- ఇద్దరికి మహా మహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు
- 539 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం


స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్

తిరుపతి ఎడ్యుకేషన్: వేదాలు విజ్ఞాన భాండాగారాలని, ఆధునిక మానవ సమాజం శాంతి, సౌఖ్యాలతో జీవించడానికి వీటిలోని అంశాలు ఎంతగానో దోహదం చేస్తాయని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం శుక్రవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ ఈ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన వేద పండితులు వి.సుబ్రహ్మణ్య శాస్త్రి సలక్షణ ఘనాపాఠి, చెన్నైకి చెందిన ఆర్. మణి ద్రావిడ శాస్త్రికి మహా మహోపాధ్యాయ పురస్కారాలను గవర్నర్ ప్రదానం చేశారు. అన్నవరానికి చెందిన కె. రామ సోమయాజి శాస్త్రి, మైసూరుకు చెందిన సి.వంశీకృష్ణ ఘనాపాఠికి వాచస్పతి పురస్కారాలను అందజేశారు. సర్టిఫికెట్ కోర్సుల నుంచి పీహెచ్‌డీ వరకు వేద విద్యనభ్యసించిన 539 మందికి డిగ్రీ పట్టాలను అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ.. వేలాది సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు గణిత, వైజ్ఞానిక, ఆర్థిక, సాంకేతిక, జ్యోతిష్య శాస్త్రాలను వేదాల్లోని వైదిక అంశాలతో మేళవించి ప్రపంచానికి తెలియజేశారన్నారు. భారతీయ సంప్రదాయం, ఆధునిక శాస్త్ర సాంకేతికత మధ్య సమన్వయం పెంపొందించుకోగలిగితే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధే శ్యాం, ఈసీ సభ్యులు హరే కృష్ణ శతపతి, ఫణి యాజులు తదితరులు పాల్గొన్నారు.

కడప దర్గాను దర్శించుకోవడం నా అదృష్టం

కడప కల్చరల్/రాజంపేట/ఒంటిమిట్ట: మతసామరస్యానికి ప్రతీక అయిన కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకోవడం తన అదృష్టమని, ఇది దైవం కల్పించిన మహాభాగ్యంగా భావిస్తున్నానని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కడప పెద్ద దర్గాకు వచ్చారు. దర్గాలో గవర్నర్ పూలచాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గవర్నర్ వెంట ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కడప నగర మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు ఉన్నారు.

ఒంటిమిట్ట రాములోరిని దర్శించుకున్న గవర్నర్

ఒంటిమిట్టలోని కోదండరాముడిని గవర్నర్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. గవర్నర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ వైఎస్సార్ జిల్లా పర్యటన ముగించుకుని ఒంటిమిట్ట నుంచి సాయంత్రం 6.03 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. శనివారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఐఐటీలకు దీటుగా ఉద్యాన వర్సిటీ

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అకడమిక్ బ్లాక్, హాస్టళ్లను ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల

రైల్వేకోడూరు: ఐఐటీలు, ఎన్ఐటీలకు దీటుగా ఉద్యాన, వ్యవసాయ వర్సిటీలను తీర్చిదిద్దుతామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలోని వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో రూ.22.81 కోట్లతో నిర్మించిన అకడమిక్ బ్లాక్, రెండు గర్ల్స్ హాస్టళ్లు, ఒక బాయ్స్ హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఉత్పత్తుల ఎగ్జిబిషన్ భవనాలను శుక్రవారం మంత్రి కాకాణి ప్రారంభించారు. వనిపెంటలోని కేవీకే అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటుచేసిన ఉద్యాన వర్సిటీ అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పరిధిలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతరాజుపేట కళాశాలలో రైతుల వసతిగృహం, అతిథిగృహం ఏర్పాటుచేయాలని మంత్రిని కోరారు. వైఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకీరాం మాట్లాడారు. అనంతరం పుట్టగొడుగుల సాగుపుస్తకం, కరపత్రాలు, అంబాజీపేట పరిశోధనా స్థానం రూపొందించిన కొబ్బరి సాగుకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు

- ఈ ఏడాది నుంచి రీస్ట్రక్చర్.. సిలబస్ రీడిజైన్
- ఈ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు
- ఫ్యాప్సీ అవార్డుల సన్నాహక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి బుగ్గన



మాట్లాడుతున్న ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం: ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రీస్ట్రక్చర్‌తో పాటు సిలబస్‌ను రీడిజైన్ చేస్తామని తెలిపారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఎక్సలెన్స్ అవార్డ్స్-2023 సన్నాహక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన వారు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఆటోమొబైల్ రంగాల్లో వీరు తమ నైపుణ్యంతో రాణించేలా తయారు చేస్తామని చెప్పారు. వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఐటీఐల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో 192 స్కిల్ హబ్‌ల్లో మెరికలు తిరిగే కోర్సులను డిజైన్ చేశామని, వీటి ద్వారా వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. అర్హులైన పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కొత్త పారిశ్రామిక పాలసీలో కొన్ని మార్పులు చేయాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇండస్ట్రియల్ హోదా కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కీలకపాత్ర ఉందన్నారు. ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి కరుణేంద్ర మాట్లాడుతూ ఫ్యాప్సీ ఎక్స్‌లెన్స్-2023 అవార్డుల కోసం జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11 కేటగిరీల్లో ఈ అవార్డులుంటాయని, ఈ అవార్డులు ఇవ్వడానికి 11 మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని తెలిపారు. ఈ అవార్డులను ఆగస్టు ఆఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ప్రదానం చేస్తామని చెప్పారు.అనంతరం అవార్డుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు, మాజీ అధ్యక్షుడు అచ్యుతరావు, ఎఫ్‌టీసీసీఐ సీఈవో ఖ్యాతి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.2 లక్షల నష్టం.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఫీజుల పేరుతో పెదనాన్న, బాబాయిల దగ్గర్నుంచి నగదు వసూలు
- ఆన్‌లైన్‌లో లుడో ఆడి డబ్బులు పోగొట్టుకున్న వైనం
- ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్పించిన స్థానికులు

బాపట్లటౌన్ : ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి బీటెక్ విద్యార్థి రూ.2 లక్షలు నష్టపోయి చివరకు ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కర్లపాలెం మండలం చింతాయపాలేనికి చెందిన తాళ్లూరి వెంకటనారాయణ విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 27న ఉదయం ఆన్‌లైన్‌లో లుడో గేమ్ తన స్నేహితులతో కలిసి ఆడాడు. ఈ గేమ్‌లో తొలుత రూ.100 పెట్టుబడికి రూ.1000 వరకు వచ్చాయి. ఇదే మోజులో సాయంత్రం వరకూ ఆడుతూనే ఉన్నాడు. ఇంతలో పాకెట్‌మనీ నిమిత్తం చేతిలో ఉంచుకున్న రూ.30 వేలు పోయాయి. తర్వాత తన స్నేహితుడి వద్ద రూ.70 వేలు, తన పెదనాన్న, బాబాయిలకు ఫోన్ చేసి కళాశాలలో ఫీజు చెల్లించాలంటూ నమ్మబలికి మరో రూ.లక్ష వరకూ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో విడతల వారీగా రూ.2 లక్షలు కోల్పోయాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి రైలు మార్గాన బాపట్ల చేరుకున్నాడు. అప్పటికే ఎలుకల పేస్ట్ తిన్నాడు. రైల్వేస్టేషన్‌లో తీవ్ర ఇబ్బంది పడుతుండటాన్ని ప్రయాణికులు గమనించి స్టేషన్‌మాస్టర్ సాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు.